పంచాయతీ ఎన్నికల తీర్మానంపై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రూరల్ మండలంలోని ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని టిడిపి మినీ మహానాడులో తీర్మానం చేయడం పట్ల మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలంలోని రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ గ్రామ పంచాయతీలకు గత 13 ఏళ్లుగా కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం పేరుతో ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. విలీన ప్రతిపాదన ఉన్న గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి ఆయా ప్రజా ప్రతినిధులు చేసిన తీర్మానాలను అనుసరించి కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాలని హైకోర్టు స్పష్టంగా పేర్కొందన్నారు.

ఇంటింటికీ రేషన్ రద్దు

- ఎండియూ సేవలకు స్వస్తి
- ఇక నుంచి దుకాణాల వద్దే సరుకులు
- రేషన్ లబ్ధిదారులు, సిబ్బంది ఆగ్రహం

ప్రజాశక్తి -కాకినాడ ప్రతినిధి

ఇంటింటికీ రేషన్ అందించే పథకానికి ప్రభుత్వం స్వస్తి పలకడంతో లబ్ధిదారుల నుంచి ఆవేదన వ్యక్తం అవుతోంది. ఇకనుంచి పాత విధానంలో మాత్రమే సరుకులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి తీసుకోవాల్సి ఉంటుంది. ఎండియూ వాహనాల వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సరుకులు అందించడం ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని, రద్దు నిర్ణయం సరికాదని అంటున్నారు.

కాకినాడ జిల్లాలో 515 గ్రామ సచివాలయాల పరిధిలో 6.43 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 1,060 రేషన్ షాపులున్నాయి. 428 ఎండియు వాహనాల ద్వారా సరుకులను అందిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం ఈ వ్యవస్థను తీసుకొచ్చి అమలు చేసింది. దీంతో అనేకమంది లబ్ధిదారులకు ప్రయాసలు పడి దుకాణాల వద్దకు వెళ్లే అవస్థ తప్పేది. ప్రజలకు ఈ వ్యవస్థ ద్వారా ఎంతో సౌకర్యంగా ఉండేది. మరోవైపు నిరుద్యోగులకు ఎండియు వాహనాలను అప్పగించడంతో కొంత ఉపాధి కూడా లభించేది. అటువంటి ఈ వ్యవస్థను రెండు రోజుల క్రితం జరిగిన ఎపి క్యాబినెట్ సమావేశంలో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎండియు వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ

15 రోజులపాటు ఇంటింటికీ పంపిణీ

గత ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చి అమలు చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు సరుకులను ఎండియు వాహనాల డ్రైవర్లు లబ్ధిదారులకు అందించేవారు. కూటమి సర్కారు షాక్ ఇవ్వడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రేషన్ సరుకుల్లో కోత విధిస్తున్న సర్కారు కందిపప్పును పూర్తిగా నిలిపివేసింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర విపరీతంగా పెరిగిపోతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే సరుకులను తగ్గిస్తోందంటూ లబ్ధిదారులు ఇప్పటికే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎండియు వాహనాల ద్వారా పంపిణీని నిలిపివేయడంతో మరింత నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగావకాశాలు యువత తీవ్ర నిరాశలో ఉంది. అటు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇటు ప్రైవేటు అవకాశాల్లేక లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అనేక ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పుడున్న ఉద్యోగులను తొలగిస్తూ వస్తోంది. ఇదే తరుణంలో ఎండియు వాహనాలు నిలిచిపోవడం వల్ల పలువురు నిరుద్యోగులుగా మారే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో డ్రైవర్, హెల్పర్, ఆపరేటర్ పోస్టులను మంజూరు చేసింది. ఇలా జిల్లాలో 1,284 మందికి ఉపాధి కల్పించింది. రేషన్ డీలర్లను తొలగించకుండానే వారికి అవకాశం కల్పించింది. జిల్లాలో పౌరసరఫరాల శాఖ, బిసి, ఎస్సి కార్పొరేషన్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండియు వాహనాల ఆపరేటర్ల మధ్య రాష్ట్ర ప్రభుత్వం కుదిర్చిన ఒప్పందం గడువు ఇంకా ఏడాదిన్నర ఉంది. ఒక ఆపరేటర్‌కు ఇచ్చే రూ.18 వేలలో డీజిల్‌కు రూ.3,000, హెల్పర్‌కు రూ.5,000 పోతే మిగిలే రూ.10 వేలతో ఆపరేటర్ కుటుంబం జీవనోపాధి పొందేవారు.

ఎండియు వ్యవస్థ ద్వారా ప్రజలకు సౌకర్యం

ఎండియు వాహనాల ద్వారా ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించటం ఎంతో సౌకర్యంగా ఉంది.వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలకు తరువాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేట్లుగా ఏర్పాటు ఉండాలి తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇక్కట్లు పాలు చేస్తుంది. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోలవద్దనే తెచ్చుకోమనటం సరైంది కాదు.

- కరణం ప్రసాదరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి.

కుటుంబాలతో రోడ్డున పడతాం

ఎండియూ వాహనాల ద్వారా సరుకులను క్రమం తప్పక ప్రతి నెలా అందజేస్తున్నాం. దీని ద్వారా కొంతలో కొంతైనా ఉపాధిని పొందుతున్నాం. ఇప్పుడు ఈ వ్యవస్థను రద్దు చేయడం వల్ల దీనిపై ఆధారపడిన వారమంతా రోడ్డున పడుతాము. ప్రజలకు ఇంటి వద్ద సరుకులను అందించడం ద్వారా సౌకర్యవంతంగా ఉండేది. ప్రభుత్వం పునరాలోచించాలి.

- అడబాల మహేశ్వరరావు, డ్రైవర్, పిఠాపురం.

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా విధానాన్ని రద్దు చేయటం వల్ల పేద కుటుంబాల వారు ఇబ్బందులు పడతారని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, నాయకులు సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు మాట్లాడుతూ ఎండియు వాహనం తమ ఇంటి వద్దకు వచ్చే సమయంలో పనులకు వెళ్లిన పేదలకు రేషన్ డిపో వద్ద రేషన్ సరుకులు ఇచ్చే ఏర్పాట్లు చేయాలి తప్ప, ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేసే విధానాన్ని ఆపేయడం అన్యాయమన్నారు. ఎండియు విధానంలో లోపాలు ఉంటే సరి చేయాలి తప్ప ఎండియు వ్యవస్థను రద్దు చేయటం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ

'ఏలేరు' గండ్లు వెంటనే పూడ్చాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ

ప్రజాశక్తి-కాకినాడ

గత సంవత్సరం వరదల కారణంగా ఏలేరు కాల్వలకు పడిన గండ్లు అన్నింటినీ వర్షాకాలం ప్రారంభానికి ముందే పూడ్చి ఖరీఫ్ పంటలకు నీటి సరఫరా, ముంపు సమస్యలు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఇన్‌ఛార్జి మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంఎల్ఎలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీతో కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు. కమిటీ సూచించిన అంశాలలో 75 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద జిల్లాలో 75 వేల రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా చేపట్టి ఇందులో 52 వేల యూనిట్లను ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగ మేళాల నిర్వహణను వివరించారు. తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలను మున్సిపల్ కమీషనర్ భావన, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ విరించారు. పటిష్టమైన వేసవి కార్యాచరణతో బోర్ల రిపోర్లు, నీటి రవాణా వంటి చర్యలతో ఏ తాగునీటి ఎద్దడిని నివారించాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఎఫ్ఒ రవీంద్రనాథ్‌రెడ్డి, డిఆర్ఒ జె.వెంకట్రావు, పాడా పీడీ ఎ.చైత్రవకర్షిణి, వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్, ట్రాన్స్‌కో ఎస్ఇ ప్రసాద్, ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-పిఠాపురం

హత్య కేసు ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ అభినందించినట్టు సిఐ జి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చేబ్రోలు నేషనల్ హైవే పక్కన కల్వర్టు వద్ద గుర్తించగా హత్య చేసినట్టు నిర్ధారించుకుని కేసు దర్యాప్తు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో నిందితులను గుర్తించి అరెస్టు చేసిన నేపథ్యంలో ఎస్‌పి బిందు మాధవ్ సిఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్‌బి.రామకృష్ణ, పిఠాపురం పట్టణ ఎస్ఐ వి.మణికుమార్, సిబ్బంది పి.శ్రీనివాసరావు, వి.విజయ బాబుకుమార్, ఎస్.బాలాజీ, ఎం.శ్రీనివాసరావు,రాఘవను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన, సున్నితమైన కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని సిరిపురంలో గురువారం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కంటికి సంబంధించి చిన్న అనారోగ్యమైనా వెంటనే వైద్యులకు చూపించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటు వైద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో 60 మంది రోగులకు కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళ జోళ్లు అందజేశారు. జనసేన జిల్లా సంస్థ కార్యదర్శి శేషారావు, మండల నాయకులు అచ్చే వీరబాబు, గోవింద్, వనుం మంగా, దనేకుల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తుల ఆన్‌లైన్

ప్రజాశక్తి - జగ్గంపేట

ఇళ్ల స్థలాల దరఖాస్తులను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని తహశీల్దారు జెవిఆర్.రమేష్ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్స్‌ను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తు చేసుకునే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డులకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దరఖాస్తులను ఆన్‌లైన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కార్టూ'నిజం'



పాలకులు వేరైనా విధానాలు అవే తప్పని ఇబ్బందులు

ఉపాధి పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధి హామీ పథకం పీడి అడపా వెంకటలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని వడ్లమూరు, గోరింట గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కంపోస్టు పిట్లు, గోకుల షెడ్లు, పశువుల నీటి తొట్ల పనులను పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ సుదీర్, జెఇ సతీష్, టెక్నికల్ అసిస్టెంట్లు బాపూజీ, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరావు, ఆర్.శివాజీ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో మాజీ మంత్రి, వైసిపి పొలిటికల్ అడ్వైజర్ ముద్రగడ పద్మనాభం పర్యటించారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన డాక్టర్ అందే చిట్టికొండ ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడటంతో ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ప్రతిపాడు నియోజకవర్గం ప్రజల చూపిస్తున్న అభిమానానికి తమ కుటుంబం రుణపడి ఉంటుందన్నారు. రాజకీయంగా తమ కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకు వచ్చిన ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ గణేషుల రాంబాబు, వైసిపి నాయకులు గుడాల వెంకటరత్నం, రెడ్డి నాయుడు, శేరు కృష్ణ పాల్గొన్నారు.

గౌరీ కోనేరు బోరు పనులు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

గౌరీ కోనేరు కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ఉన్న బోరు మోటారు కాలిపోవడం వల్ల రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిచిపోయిందని మున్సిపల్ డిఇ ప్రకాశరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ బోరు ద్వారా సుమారు నాలుగు వార్డుల పరిధిలో ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతోందన్నారు. దీని ప్రాముఖ్యతను పరిగణలోకి తీసుకుని యుద్ధ ప్రాతిపదికపై రిపేరు పనులు పూర్తి చేశామన్నారు. కాలిపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారు ఏర్పాటు చేసి రిపేరు పనులు పూర్తి చేశామన్నారు. శుక్రవారం నుండి ఈ బోరు ద్వారా యథావిధిగా ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో యోగ మాసోత్సవాల శిక్షణను గురువారం ప్రారంభించారు. ఆలయ ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఈ శిక్షణ ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ఇఒ నీలకంఠం మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యోగా మాసోత్సవాల్లో భాగంగా ఆలయంలో జూన్ 21 వ తేదీ వరకు రోజూ ఉదయం10 గంటల నుండి 11 గంటల వరకు యోగాపై శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు.

సత్యదేవుని దర్శించుకున్న మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామిని రాష్ట్ర గనులు, ఖనిజాలు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం రాత్రి దర్శించుకున్నారు. దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. మంత్రికి వేద పండితులు ఆశీస్సులు నిర్వహించగా ఇఒ సుబ్బారావు స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదం అందజేశారు. మైనింగ్ అధికారులు ఎక్సైజ్ అధికారులు దేవస్థానం పాల్గొన్నారు.

నిష్పత్తి ప్రకారం టిడిపికి దక్కని పదవులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కూటమి పాలనలో కాకినాడ జిల్లాకు నిష్పత్తి ప్రకారం టిడిపి క్యాడర్‌కు తగిన పదవులు దక్కడం లేదని ఆ పార్టీ సీనియర్ నేత, జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనలో ఉన్న ఒక నాయకునికి ఏకంగా రెండు పదవులు కట్టబెడతారా అంటూ ప్రశ్నించారు. కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో గురువారం టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన పార్టీ జిల్లా మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పార్టీ కార్యకర్తలకు ఆర్థిక స్థితి కల్పించి ఆదుకోవాలన్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితి బాగోలేదని పదవులు ఒకే పార్టీకి కట్టబెట్టడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మిత్రధర్మం పాటిస్తూనే టిడిపి కార్యకర్తలకు నిష్పత్తిగా న్యాయం చేయాలని సూచించారు. జిల్లాలో గతంలో జిల్లాలో 21 మంది ఎమ్మెల్యేలు ఉండేవారని తామంతా సమిష్టి నిర్ణయాలను తీసుకొని రాష్ట్రస్థాయిలో తెలియజేసే వారన్నారు. అందుకు దానికి ప్రతిస్పందన వచ్చి జిల్లా అభివృద్ధికి బాసటగా ఉండేదన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏడుగురు ఎంఎల్ఎల మధ్య సమన్వయం కొరవడిందని తెలిపారు. మహానాడుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గత సిఎం వైఎస్.జగన్ నాశనం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. దేశంలో అందరికంటే ఎక్కువగా రూ.32 వేల కోట్లు పింఛన్లకు ఇస్తున్నామని వచ్చే నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలను గౌరవించి వారి ఉన్నతికి ప్రోత్సహించే పార్టీగా అభివర్ణించారు. ఎంఎల్ఎలు వరుపుల సత్యప్రభ, వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్పలతోపాటు ఇన్‌చార్జులు, పార్టీ ప్రముఖుల ఆయా నియోజవర్గాల్లో సమస్యలను లేవనెత్తారు. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి సత్తిబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబీ, మహాసేన రాజేష్, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ

ఎండియు వాహనాల రద్దుపై ధర్నా

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను ప్రభుత్వం తొలగించడం దారుణమని వైసిపి పిఠాపురం ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ వంగా గీత అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎండియు ఆపరేటర్లను కొనసాగించాలని కోరుతూ వాహనాలతో ఆపరేటర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గీత మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18,520 మంది ఆపరేటర్లు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మైనారిటీలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు కల్పించి ఇంటి వద్దకే రేషన్ ప్రారంభించామన్నారు. కరోనా సమయంలో రేషన్ పంపిణీ విధానం బాగా ఉపయోగపడిందని తెలిపారు. మాజీ సిఎం వైఎస్.జగన్ మీద అక్కసుతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు దగ్గరగా ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. అర్థాంతరంగా వారిని తొలగిస్తే వారి మీద ఆధారపడ్డ కుటుంబాలు ఏమవ్వాలని ప్రశ్నించారు. ఒక్క ప్రకటనతో వేల మంది ఆపరేటర్లను వారిపై ఆధారపడ్డ కుటుంబాలను రోడ్డెక్కించారన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దీనిపై సమీక్షించి ఉపసంహరించుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఎండియు ఆపరేటర్లు తహశీల్దారు కెవి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బుల్లి వెంకన్న, ఎస్.శ్రీనివాస్, ఎ.వెంకటస్వామి, పి.దానియేలు, ఎం.శివరామకృష్ణ, ఎంవివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న మాజీ ఎంపీ వంగా గీత

'తునిలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా'

ప్రజాశక్తి-తుని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తుని ఎంఎల్ఎ యనమల దివ్య చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సిద్ధమా అంటూ టిడిపి నాయకులు చింతమనేని అబ్బాయి సవాల్ చేశారు. గురువారం తుని పట్టణంలోని కూటమి కార్యాలయంలో కూటమి నాయకులు విలేకరుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. యనమల రామకృష్ణుడు, కూటమి ప్రభుత్వంపై రాజా చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ పరిపాలనలో మంత్రిగా ఉండి నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివద్ధి చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. తప్పుడు కేసులు అక్రమ కేసులు పెట్టడం యనమల కుటుంబానికి లేదన్నారు. మంత్రిగా రాజా చేసిన అరాచకాలు ప్రజలకు తెలుసన్నారు. 2019లో తొండంగి మండలంలో యాదవ సామాజిక వర్గాలకు చెందిన గొర్రెల లోన్లు పేరుతో రూ.ఐదు కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ అంకమ్మరెడ్డి రమేష్, కుసుమంచి శోభారాణి, బోడపాటి అప్పారావు, మోత్కూరు వెంకటేష్, దంతులూరు చిరంజీవ రాజు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

16వ రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు కోనాల వెంకటరమణ, బొమ్మన రవికుమార్, తూతిక సాయి, నాళం శివకుమార్, మహపాతిన అరుణ్, పాపారావు, ఎస్‌కె బషీర్, సుంకర సత్తిరాజు, బాసిన భద్రరావు, జి.నాగేశ్వరరావు, జి.సతీష్, వి.భాస్కర్, పూల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న నాయకులు

నాగభూషణం మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన అమీనాబాద్ గ్రామానికి చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకుడు ఏడిద నాగభూషణం కుటుంబాన్ని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు గురువార్ణం పరామర్శించారు. భూషణం కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాదిగ జిల్లా ఉద్యోగుల సమాఖ్య నాయకులు కొండేపూడి రాజాజీరాయ్, రాహుల్ రాయ్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ సాధనలో జీవితాలను అర్పించిన కార్యకర్తల త్యాగాలు వృథా పోలేదని అన్నారు. జుత్తుక బాబారావు, మోర్త రవి, బెన్ జాన్సన్, మోర్త కోటి, దూలపల్లి సూరిబాబు, కొండేపూడి వీర్రాజు, ఏడిద కిరణ్, దొరబాబు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై వైద్య సేవలు అవసరమైన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.4 లక్షల 74 వేలను చెక్కులను ఎంఎల్ఎ సత్యప్రభ అందజేశారు. ఈ సందర్భగా ఎంఎల్ఎ సత్య ప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60 మంది లబ్ధిదారులను ఆదుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్నా శివ, బద్ది రామారావు, బొదిరెడ్డి గోపి, గొల్లపల్లి బుజ్జి, పర్వత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

శ్యామ్ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు మెరుగు శ్యామ్ (19) మృతదేహం గురువారం లభ్యమైంది. ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మెరుగు శ్యామ్, వంక ఇసాక్, రామిశెట్టి వీరబాబు సోమవారం అర్ధరాత్రి వేటకు వెళ్లారు. తుపానుకారణంగా అలలు ఉధృతికి బోటు బోల్తా కొట్టడంతో సముద్రంలో పడిపోయిన ఇసాక్, వీరబాబు సురక్షితంగా హోప్ ఐలాండ్‌కు చేరుకున్నారు. శ్యామ్‌కు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం కోసం మత్స్యకారులు రెండు రోజుల నుండి సముద్రంలో గాలింపు చేపట్టారు. హోప్ ఐలాండ్ తీరంలో మృతదేహాన్ని గుర్తించి మత్స్యకారులు స్వగ్రామానికి తీసుకొచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి, బంగారిపేట రహదారి మధ్య గురువారం ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రౌతులపూడి గ్రామానికి చెందిన మోర్త రమేష్‌బాబు, గేడం ప్రసాద్ బైకుపై రౌతులపూడి వస్తుండగా బొలెరో వాహనం ఢీకొనడంతో రమేష్ బాబు రహదారిపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. రమేష్ బాబును రౌతులపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యచికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- శంఖవరం

స్థానిక జెడ్‌పి హైస్కూల్లో రెండు రోజులు కిందట స్కూలు కార్యాలయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. శంఖవరం గ్రామానికి చెందిన గామాల అశోక్, బోడపాటి చిన్నోడును అరెస్టు చేసి వారి వద్ద ఆటో సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-పిఠాపురం

పాదగయ సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి కారు బీభత్సం సష్టించింది. బైకుపై ప్రయాణిస్తున్న ముగ్గురిని ఢీకొని పాదగయ క్షేత్రం వద్ద నిలిపివుంచిన బైకులపైకి దూసుకెళ్లింది. బైకుపై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని స్థానిక ఇందిరానగర్‌కు చెందిన పి.కృష్ణ, ఎ.వెంకటేష్, కె.మహేంద్రగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనలో ఐదు బైకులు ధ్వంసం అయ్యాయి. కారులో బెలూన్ ఓపెన్ కావడంతో... కారులో ప్రయాణిస్తున్నవారికి ప్రమాదం తప్పింది. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి -దేవరపల్లి

హత్య కేసులో నిందితునిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. 2017లో దేవరపల్లి రంగరాయ కాలనీలో బందపురం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ బావమరిది షేక్ కరీముల్లాను కత్తితో నరికి చంపాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన భార్య కాపురానికి రావట్లేదని, దీనికి కారణంతో కరీముల్లానే అనే కోపంతో ఈ దారుణానికి ఒడిగట్టి గుర్తించి కోర్టులో హాజరపరిచారు. నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జివిఎల్ సరస్వతి తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి కాకులపాటి వెంకటరమణ వాదించారు.

తల్లి, కుమార్తెకు గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతురు గాయపడ్డారు. తాళ్లరేవుకు చెందిన సాహితి ఆదిత్య యూనివర్సిటీలో గురువారం ఎంసెట్ ఎగ్జామ్ రాసి అనంతరం తన తల్లితో కలిసి స్కూటీపై తాళ్ళరేవు వెళుతుండగా ఎడిబి రోడ్డులో ఆగి ఉన్న వ్యానును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీ కూతురు గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మందికి గాయాలయ్యాయి. సిఐ వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి. లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి. లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎన్.పావని టాటా మేజిక్ వ్యాన్ డ్రైవర్ చింతలచెరువు మధు అన్నవరంలో సత్యనారాయణ స్వామి దర్శనానికి బుధవారం రాత్రి బయలు దేరారు. అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిలోని వైఎస్ఆర్ జంక్షన్ వద్ద ఆగిఉన్న లారీని ఈ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, డ్రైవర్ కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వీరందరూ ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అధికంగా మద్యం తాగడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని నడుపల్లి పంచాయతీ పరిధి నడిపల్లి కోటకు చెందిన చదలవాడ ప్రసాద్ (37) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. ఆహారం తీసుకోకుండా అధిక మద్యం తాగడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. భార్య చదలవాడ ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వర రావు తెలిపారు.

కేకును కట్ చేస్తున్న కొండబాబు

ఘనంగా కొండబాబు పుట్టిన రోజు

ప్రజాశక్తి -కరప

జనసేన పార్టీ సీనియర్ నాయకుడు భోగిరెడ్డి కొండబాబు పుట్టిన రోజు కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ఆశీస్సులతో జనసేన యువనాయకుడు యాళ్ల పండు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరపలో చిరంజీవి కళ్యాణ మండపంలో జనసేన జిలా అధ్యక్షుడు, మండల, గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును భోగిరెడ్డి కొండబాబు కట్ చేశారు. భారీ గజమాలతో కొండబాబును సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకుల్లో కొండబాబుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. గత ఎన్నికల్లోనే జడ్‌పిటిసి స్థానానికి పోటీకి దిగేందుకు ఎవరు ముందుకు రాకపోయినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి బరిలో నిలిచారన్నారు. అనేక బెదిరింపులు, దాడులు జరిగినా ఎదుర్కొన్నారన్నారు. పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల హరినాథ్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, గోన అంజి, గొల్లపల్లి శేఖర్, పి.పవన్, మెండు గోవిందు, పన్నీరు శివ, చిన్నారి శీను, వాసంశెట్టి మహేష్, నక్కా మల్లి, నక్కా బ్రహ్మాజీ, బి.రాధాబాబు, ఎస్.భవానిశంకర్, డి.రాజు, ఎస్.వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

చేనేత కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

ఉప్పాడని టూరిస్ట్ ప్లేస్‌గా తీర్చిదిద్దుతామని ఎపి టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి తెలిపారు. ఉప్పాడ ప్రాంతాన్ని, చేనేత కార్మికులు నేస్తున్న మొగ్గాలను ఆమె పరిశీలించారు. గురువారం ఉప్పాడ వీవర్స్ కాలనీలో మగ్గాలపై నేస్తున్న చీరలను పరిశీలించారు. చేనేత కార్మికులు చీరల తయారీ చేసే విధానాన్ని అభినందించారు ఈ సందర్భంగా పద్మారాణి మాట్లాడుతూ ఉప్పాడ తీర ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివద్ధి చేయడంతో పాటు వచ్చిన పర్యాటకులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఉప్పాడ తీరంలో పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాలుగా సౌకర్యాలు ఉన్నాయని, ఉప్పాడ పర్యాటక రంగంగా అభివృద్ధి చెందితే మత్స్యకారులకు జీవనోపాధి పొందేందుకు అనువుగా ఉపయోగపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో టూరిజం కన్సల్టెంట్ కృష్ణగోయల్, మణికంఠ, ఎంపిడిఒ పి.రవికుమార్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలతో మహిళలకు చేయూత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

డ్వాక్రా సంఘాలు సమాజంలో మహిళల ఆర్థిక ఉన్నతికి దోహదం చేస్తున్నట్టు డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం ఎపిఎం సరస్వతి అధ్యక్షతన నిర్వహించిన రూరల్ డ్వాక్రా సంఘాల సమావేశంలో పీడీ మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు 2001లో ప్రారంభమయ్యే నాటికి ఒక్కో మహిళకు రూ.10,000 రుణాలు వచ్చేవని, ఇప్పుడు రెండు లక్షల వరకు ప్రతి మహిళా రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు సకాలంలో రుణాలు చెల్లించడంతో పాటు విధిగా పొదుపు పెట్టడం వల్ల సంఘం రుణపరపతి మరింత పెరుగుతుందన్నారు. ఎపిడి జిలానీ, డిపిఎంలు బాబూరావు, రామ్, భరత్, ఎపిఎంలు అనిల్ కుమార్, యు.సూర్యనారాయణ, రామకృష్ణ, ప్రసన్నకుమారి, మేనేజర్ కస్తూరి పాల్గొన్నారు.

క్రైమ్ టీమ్‌లకు ఎస్‌పి రివార్డులు

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం సబ్ డివిజన్ క్రైమ్ టీముకు జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ గురువారం అవార్డులు అందజేశారు. క్రైమ్ పోలీసులు ఇటీవల అన్నవరం బస్టాండ్‌లో చోరీలో రూ.10 లక్షలు సొత్తును 24 గంటల్లోనే కేసును ఛేదించారు. సామర్లకోట క్రైమ్ స్టేషన్ సిఐ అంకబాబు, ఎఎస్ఐ బలరామ్, హెచ్‌సిలు రాధాకృష్ణ, శ్రీహరికి అవార్డులు అందజేశారు. వారిని డిఎస్‌పి డి.శ్రీహరిరాజు అభినందించారు.

ఎస్ఐకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎస్ఐ రఘునాథరావు గురువారం ఎస్‌పి బిందుమాధవ్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మండలంలో నేరాలు తగ్గే విధంగా ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఎస్ఐను ఎస్‌పి అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

శిబిరాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు

రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని తహశీల్దారు కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తల సేమియా చిన్నారుల కోసం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జనసేన పార్టీ పిఠాపురం ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడేందుకు ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసామని తెలిపారు. దేనినైనా డబ్బుతో కొనుక్కోవచ్చు కానీ రక్తాన్ని డబ్బుతో కొనలేమని, ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదానం చేయడానికి వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, పలువురు నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కెవివి.సత్యనారాయణ, ఎంఇఒ బి.శివప్రసాద్, ఆర్ఐ బాలకృష్ణ, జనసేన నాయకులు బస్స చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, గరగ తాతాజీ, బలిరెడ్డి గంగబాబు, ఊటా నానిబాబు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

యోగాంధ్ర-2025 నిర్వహణకు ప్రణాళిక

ప్రజాశక్తి-కాకినాడ

యోగాంధ్ర-2025 కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఇతర ముఖ్య శాఖల అధికారులతో కలిసి ఆయన చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో యోగాంధ్ర-2025 కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 24 నుంచి ప్రతిరోజు యోగాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. వివిధ రకాల పోటీలకు సంబంధించి గ్రామ స్థాయిలో మే 26 నుంచి 29 వరకు, మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7 వరకు, జిల్లా స్థాయి పోటీలు జూన్ 9 నుంచి 14 వరకు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణ తరగతులకు సంబంధించి యోగా ట్రైనర్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, డిపిఒ వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సొమ్ములు చెల్లించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఉపాధి హామీ కూలీలకు సొమ్ములు వెంటనే చెల్లించాలని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పంచాయితీరాజ్ అతిథి గృహం వద్ద ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏప్రియల్ నుండి వేతనాలు చెల్లించ లేదడం లేదన్నారు. నెలలు తరబడి వేతనాలు ఇవ్వటం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారన్నారు. రోజు కూలికి వెళ్తేనే తప్ప పూట గడవని ఇటువంటి వారికి కూలి సొమ్ములు వెంటనే వారి ఎకౌంట్లలో జమ చేయాలన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, బడుగువాని లంక

టెండరు నోటీసు

రి.క. నెం.03/2025 — తేది.22-05-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలంలోని బడుగువానిలంక గ్రామపంచాయతీకి 2025-2026 సంవత్సరమునకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 29-05-2025 తేదీన ఉదయం 11.00 ల వరకు బడుగువాని లంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయముల కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

వ.నెం.	అయిటము వివరములు	టెండర ధరావత్తు
1	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.హెచ్. సామాగ్రి) ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మరియు ఇతర ప్రజారోగ్య సామాన్లు సప్లై చేయుటకు	రూ. 100/-
2	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.డబ్ల్యూ.ఎస్. సామాగ్రి) చేతి పైపులు మరియు కుళాయి విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
3	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ సామాగ్రి మరియు విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
4	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన స్వీపర్లు, ట్యాంక్ వాచరు	రూ. 100/-

గమనిక: గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- శ్రీమతి దూలం వెంకటలక్ష్మి
గ్రామపంచాయితీ,బడుగువానిలంక
ఆలమూరు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

సం/- శ్రీ చింతా వీరవెంకటరెడ్డి
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
బడుగువానిలంక, ఆలమూరు మండలం

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి- సామర్లకోట

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామానికి చెందిన మల్యాల సీతాలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 55,206 చెక్కును రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, టిడిపి నాయకుడు వల్లూరి శ్రీనివాస్ గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి గొప్ప ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ వైద్య సేవలను కోల్పోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడతామని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఆరోగ్య సంరక్షణపై గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరోగ్య సంరక్షణపై గర్భిణులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం అంబాజీ పేట, ముక్కామల పిహెచ్‌సిల వద్ద వైద్యాధికారులు డాక్టర్ కెఎన్.శ్రీనివాస్, డాక్టర్ టి.దివ్యశ్రీ అధ్యక్షతన ప్రపంచ ఎక్లంప్సియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు డెలివరీ ముందు లేదా డెలివరీ సమయంలో బిపి ఉంటే వైద్య నిపుణుల సలహా పొందడం తప్పనిసరని అన్నారు. ఎక్లంప్సియా వంటి హానికరమైన సమస్యలు నుంచి మిమ్మల్ని, మీ చిన్నారిని రక్షించుకోవాలని అన్నారు. డాక్టర్ టి.దివ్యశ్రీ మాట్లాడుతూ బిపిని అదుపులో ఉంచుకోవడం, శారీరక, మానసిక, ఒత్తిడిని తగ్గించే ఆరోగ్యకర జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో సిహెచ్ఒలు బి.అప్పారావు, రవికుమార్, ఆయా పిహెచ్‌సిల సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

హౌసింగ్ లే ఔట్ల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం చేపట్టిన లే ఔట్లలో ఇళ్లు నిర్మించని ప్లాట్లను ఆర్‌డిఒ శ్రీరమణి గురువారం పరిశీలించారు. ఎంపిడిఒ శ్రీలలిత, హౌసింగ్ అధికారులతో కలిసి వడ్లమూరు, ఆర్‌బి.కొత్తూరు గ్రామాలలోని లే ఔట్లను పరిశీలించారు. గతంలో ఇళ్ల పట్టాలు పొంది నేటి వరకూ ఇళ్లు నిర్మించుకోని ప్లాట్లను పరిశీలించి ఆ ప్లాట్ల లబ్ధిదారులను పిలిచి వేగవంతంగా ఇళ్లు నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ సువర్ణ రాజు, ఇఒపిఆర్‌డి త్సలికి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి కళావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో కనకదుర్గ గుడి వెనకాల పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.24 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, డి.ముప్పవరం గ్రామం, డి.నెం.3-37, కాపురస్తులు, **శ్రీలంక సతీష్, తండ్రి: శ్రీను** అను నాయొక్క **పాస్‌పోర్టు నెం.W2916982** ది.15.05.2025న జిరాక్స్ తీసుకొను నిమిత్తం డి.ముప్పవరం గ్రామం నుండి నిడదవోలు వచ్చుచుండగా దారి మార్గంలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

శ్రీలంక సతీష్, తండ్రి: శ్రీను
ఫోన్: 8142809825

రెండులింకు దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, పడమర చోడవరం, గ్రామ నివాసి అయిన, కూచిపూడి వినోద్ కుమార్. తండ్రి వెంకటేశ్వర రావుకు చెందిన. **నం.6991.- 6992**.ర్లు గల లింకు దస్తావేజులు,**8-5-2025**.వ. తేదీ న, చోడవరం నుండి అనంతపల్లి ఫోటో స్టార్ట్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళుతూ ఉండగా మార్గమధ్యంలో సదరు దస్తావేజులు కలిగిన కవరు పడిపోయింది దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కూచిపూడి వినోద్ కుమార్
తండ్రి వెంకటేశ్వరరావు. డోర్. నెంబర్: 1-7B. రామాలయం వద్ద. పడమర చోడవరం. నల్లజర్ల మండలం. తూర్పుగోదావరి జిల్లా. ఆంధ్రప్రదేశ్. పిన్ నెంబర్.534111. ఫోన్ నెంబర్.9492558999.

ప్రకటన

నా క్లయింటు TATA CAPITAL Limited, రాజమండ్రి రిప్రజెంటెడ్ బై మేనేజర్ వారి సంజాయిషి పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తూర్పుగోదావరి జిల్లా, తాళ్ళపూడి మండలం, వేగేశ్వరపురం గ్రామ, డోర్ నెం. 6-10 రు కాపురస్తులు తైలం జేయేషు అమ్మిరాజు గారి కుమారుడు తైలం సీతారామాంజనేయులు గారి ది. 23-01-2025 రిజిష్టర్డు కాబడిన దఖలు దస్తావేజు రీత్యా దఖలు పొంది తదాది షెడ్యూలు ఆస్తిని సర్వ, సంపూర్ణ, స్వాధీన హక్కుభుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారు. యిట్టి స్థితిలో ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తైలం సీతారామాంజనేయులు గారు హామీగా ఉంచి ఋణ సౌకర్యం పొందుట కొరకు TATA CAPITAL Limited, రాజమండ్రి వారికి అభ్యర్ధన చేసియున్నారు. కావున ఎవరికైననూ ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై గాని, ఎవరికైననూ, చట్ట రీత్యా చెల్లదుగు క్లయిములు గాని మరి ఏవిధమైన అభ్యంతరములు గాని ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 07 రోజుల లోపుగా లిఖితపూర్వక ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గాని రాని యెడల, షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా ఎంచి, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిని హామీగా స్వీకరించి, ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆ దర్శిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు, క్షయములు గానీ, చట్టపరముగా బైండు చేయజాలవనియు, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిపైపొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయటమైనది.

షెడ్యూలు

1టవ ప్రతి: తూ.గో.జిల్లా, తాళ్ళపూడి (మం), శ్రీ వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసులో చేరిన, వేగేశ్వరపురం గ్రామ పంచాయితీలో గల వేగేశ్వరపురం గ్రామం తాలూకు రి. సర్వే నెం. 292-1సి రు దాఖలా 344 చ.గ.లలో స్తలంలో తూర్పు వైపు 140 చ.గ.ల స్తలం అందులో గల డోర్ నెం. 6-10 రు దాఖలా 736 చ.అ.ల ప్లింత్ ఏరియా గల పెంకుటిల్లుతో కూడిన స్తలము.

2వ ప్రతి: వేగేశ్వరపురం గ్రామం తాలూకు రి. సర్వే నెం. 292-1సి రు దాఖలా 344 చ.గ.లలో స్తలంలో తూర్పు వైపు 185 చ.గ.ల స్తలం అందులో గల డోర్ నెం. 6-10 రు దాఖలా 242 చ.అ.ల ప్లింత్ ఏరియా గల ఆర్.సి.సి. డాబా మరియు 50 చ.అ.ల ప్లింత్ ఏరియా గల ఆర్.సి.సి. లేవిట్రీ బాత్రూమ్‌తో కూడిన స్తలము.

3వ ప్రతి: వేగేశ్వరపురం గ్రామం తాలూకు రి. సర్వే నెం. 292- 1సి రు దాఖలా 344 చ.గ.లలో స్తలంలో పడమర వైపు 19 చ.గ.ల స్థలము (సమీప డోరు నెం. 6-10 రు).

పి.ఎస్.నాయుడు, అడ్వకేట్
డోర్ నెం. 2-146/1, వేగేశ్వరపురం, తాళ్ళపూడి మండలం, తూ॥గో॥జిల్లా, ఫోన్ నెం: 7670943492

IDBI BANK LTD

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిటైల్ రికవరి, పైడా ఛాంబర్స్, 9-14-15, వి.ఐ.పి రోడ్డు, సిరిపురం, విశాఖపట్నం-530003, ఎ.పి.

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం **ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ది రూల్స్) నందలి రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు : శ్రీమతి నెక్కల వెంకటలక్ష్మి గారిని చెల్లించవలసిన బకాయి మొత్తం ది.08-01-2025 నాటికి రూ.4,39,183/- (అక్షరాలా నాలుగు లక్షల ముప్పైతొమ్మిది వేల నూట ఎనభైమూడు రూపాయలు మాత్రమే) (ఋణగ్రహీత/ తనఖాదారు/ హామీదారు నోటీసు తరువాత చెల్లించిన బకాయి తగ్గించబడును)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు, ఛార్జీలు ఇతర ఖర్చులతో ఈ నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.12-03-2025 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

బకాయిసొమ్ము చెల్లించడంలో **ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు**లు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, చట్టం 2002 సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.19-05-2025 న స్వాధీనం చేసుకోవడమైనదని** ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి పడిన సొమ్ము **ది.08-01-2025 నాటికి రూ.4,39,183/- (అక్షరాలా నాలుగు లక్షల ముప్పైతొమ్మిది వేల నూట ఎనభైమూడు రూపాయలు మాత్రమే) (ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు నోటీసు తరువాత చెల్లించిన బకాయి తగ్గించబడును)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు, ఛార్జీలు ఇతర ఖర్చులతో **ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ 8 ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తనఖావుంచబడిన ఆస్తి యొక్క వివరము
(రిజిస్టర్ దస్తావేజు నెం.4515/2022 ప్రకారం తనఖావుంచబడిన షెడ్యులు ఆస్తి వివరములు):
శ్రీమతి నెక్కల వెంకటలక్ష్మికి చెందిన ఆస్తులు తనఖావుంచబడినవి :

షెడ్యూలు : పెద్దాపురం, వాలుతిమ్మాపురం, పియమ్ఎవై(యు)-వైయస్ఆర్ జగనన్న నగర్ నందు సర్వే నెంబరు : 171 నందు సమీప డి.నెం.12-6-109 లో మొత్తం బ్లాక్ ఏరియా 704 చ॥గ॥ల విస్తీర్ణములో 1వ అంతస్థు నందు 430 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాల భాగములోని నిష్పతివాటా కలుపుకొని)ల విస్తీర్ణములో నిర్మించిన బ్లాక్ నెం.సి-12 లోని ఫేజ్ 1 నందు ఒక ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్ 6 కు చెందిన అవిభాజ్యపు భాగమైన 22 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమికి సంబంధించిన యావదాస్తి. బ్లాక్ హద్దులు (సి-12 బ్లాక్) : ఉత్తరం: సి-9, **దక్షిణం:** రోడ్, **తూర్పు:** సి-11, **పడమర:** రోడ్. **1వ అంతస్థులోని ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్ 6 కు హద్దులు : ఉత్తరం:** యఫ్‌యఫ్-5, **దక్షిణం:** శూన్యాకాశము/లిఫ్ట్ ఏరియా, **తూర్పు:** శూన్యాకాశము, **పడమర:** ఉమ్మడి వరండా(1.8 మీ॥). అన్నింటితో కలిపి మరియు ఒకటేకాగల నిర్మాణాలు మరియు నిర్మాణాలు, ప్రస్తుతం మరియు భవిష్యత్తు కలుపుకొని.

తేది : 19-05-2025, ప్రదేశం: విశాఖపట్నం — **సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.**

IDBI BANK LTD

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిటైల్ రికవరి, పైడా ఛాంబర్స్, 9-14-15, వి.ఐ.పి రోడ్డు, సిరిపురం, విశాఖపట్నం-530003, ఎ.పి.

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం **ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ది రూల్స్) నందలి రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు : శ్రీమతి సూర్యవతి మానెం గారిని చెల్లించవలసిన బకాయి మొత్తం ది.09-12-2024 నాటికి రూ.4,38,266.40 పై॥ (అక్షరాలా నాలుగు లక్షల ముప్పైఎనిమిది వేల రెండు వందల అరవైఆరు రూపాయలు మరియు పైసలు నలభై మాత్రమే) (ఋణగ్రహీత/ తనఖాదారు/హామీదారు నోటీసు తరువాత చెల్లించిన బకాయి తగ్గించబడును)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు, ఛార్జీలు ఇతర ఖర్చులతో ఈ నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.11-02-2025 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

బకాయిసొమ్ము చెల్లించడంలో **ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు**లు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, చట్టం 2002 సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.19-05-2025 న స్వాధీనం చేసుకోవడమైనదని** ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి పడిన సొమ్ము **ది.09-12-2024 నాటికి రూ.4,38,266.40 పై॥ (అక్షరాలా నాలుగు లక్షల ముప్పైఎనిమిది వేల రెండు వందల అరవైఆరు రూపాయలు మరియు పైసలు నలభై మాత్రమే) (ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు నోటీసు తరువాత చెల్లించిన బకాయి తగ్గించబడును)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు, ఛార్జీలు ఇతర ఖర్చులతో **ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ 8 ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తనఖావుంచబడిన ఆస్తి యొక్క వివరము
(రిజిస్టర్ దస్తావేజు నెం.3971/2022 ప్రకారం తనఖావుంచబడిన షెడ్యులు ఆస్తి వివరములు):
శ్రీమతి సూర్యవతి మానెంకి చెందిన ఆస్తులు తనఖావుంచబడినవి :

షెడ్యూలు : పెద్దాపురం, వాలుతిమ్మాపురం, పియమ్ఎవై(యు)-వైయస్ఆర్ జగనన్న నగర్ నందు సర్వే నెంబరు : 171 నందు సమీప డి.నెం.12-6-109 లో మొత్తం బ్లాక్ ఏరియా 704 చ॥గ॥ల విస్తీర్ణములో 1వ అంతస్థు నందు 430 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాల భాగములోని నిష్పతివాటా కలుపుకొని)ల విస్తీర్ణములో నిర్మించిన బ్లాక్ నెం.సి-17 లోని ఫేజ్ 1 నందు ఒక ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్ 7 కు చెందిన అవిభాజ్యపు భాగమైన 22 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమికి సంబంధించిన యావదాస్తి. బ్లాక్ హద్దులు (సి-17 బ్లాక్) : ఉత్తరం: సి-16, **దక్షిణం:** రోడ్, **తూర్పు:** రోడ్, **పడమర:** సి-18. **1వ అంతస్థులోని ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్ 7 కు హద్దులు : ఉత్తరం:** శూన్యాకాశము/లిఫ్ట్ ఏరియా, **దక్షిణం:** యఫ్‌యఫ్-8, **తూర్పు:** శూన్యాకాశము, **పడమర:** ఉమ్మడి వరండా(1.8 మీ॥). అన్నింటితో కలిపి మరియు ఒకటేకాగల నిర్మాణాలు మరియు నిర్మాణాలు, ప్రస్తుతం మరియు భవిష్యత్తు కలుపుకొని.

తేది : 19-05-2025, ప్రదేశం: విశాఖపట్నం — **సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.**